
# మంచితీర్థం

అవసరాల
నారాయణరావు

*సత్యాన్వేషి, అహింసామూర్తి అయిన మహాత్ముని జన్మభూమిలో, మహాత్ముని శతజయంతి సందర్భంలో, మహాత్ముని బోధనలను అనుక్షణమూ గుర్తు చేసుకుంటున్న సమయంలో — మతవైషమ్యం, రక్తపాతం! మనసుకు, మాటకు, చేతకు పొంతనం లేకపోవడంకన్న ఈ విష పరిణామానికి వేరొక కారణమేమి లేదు.*



నున్నటి బోడిగుండు.

నుదురుమీద చుక్కబొట్టు.

ముక్కుమీద మునలికళ్లద్దాలు.

మూతిమీద పైపెదవి అంచుకి సమానంగా పెదవి పొడుగునా పొట్టిగా కత్తిరించిన నెరిసిన మీసాలు.

మందహాసంతో ఉన్న బోసినోరు.

వస్త్రరిక్త వక్షం.

మోకాళ్లపైకి చుట్టబెట్టుకున్న మూరెడు అంగవస్త్రం.

ఎడంపక్క అంగవస్త్రంమీద గొలుసుతో మొల హొంచి కిందికి వేళ్లాడుతూ దోపుకున్న ఓ జేబు గడియారం.

కుడిచేతిలో ఊతకర్ర.

దీవిస్తున్నట్లు. . . పైకెత్తిన ఎడమ అరచెయ్యి.

ఒక కాలు వెనక, ఒక కాలు ముందూ వేసి నడుస్తున్న భంగిమలో ఎడంగా ఉన్న పాదాలు.

పాదాలకు ఆకుచెప్పులు.

సత్యాహింసలకూ, సర్వమానవ సమానత్వాలకూ చిహ్నమైన పూజ్యబాపూజీ నిలువెత్తు తైలవర్ణచిత్రం.

కచేరీసావిడి ముందు హోలుతో ప్రవేశద్వారాని కెదురుగా ఉన్న గోడమీద చక్కని ఫ్రేములో చుట్టూ పైనించి కిందికి వేళ్లాడుతూన్న నూలుదారపుదండతో గంభీరంగా ఉన్న ఆ చిత్రం కింద చాపమీద కూర్చుని, తనకు ఇటుపక్క, అటుపక్క సైనుగుడ్డతో కట్టిన దస్త్రాలు పడేసుకుని, ముందువైపు కొంచెం ఏటవాలుగా ఉన్న రాతబల్లమీద చాటంత రిజిస్టరు ఒకటి పరుచుకుని కరణీకం లెఖ్ఖలేవో వ్రాసుకుంటున్నారు కరణం వెంకటరామయ్యగారు.

''దణ్ణాలు, బాబయ్యా!''

నెత్తిమీద తలపాగా.

తలపాగాకీ, చెవికీ మధ్య సందులో సగం కాల్చి ఆర్పేసి దోపుకున్న లంకాకు పొగచుట్ట.

చేతివేళ్లతో పక్కలకు దువ్వుకున్న గుబురుమీసాలు.

నాలుగు పేటలు తిప్పిన ఎర్రని మొలతాడు మీద నించి తువ్వాలును ముందూ వెనకా కొసలు కిందికి వేళ్లాడేలా పెట్టుకున్న గోచీ.

చేతిలో ఓ దుడ్డుకర్ర.

కాళ్లకు కిర్రుచెప్పులు.

హోలుముందున్న మెట్లకు అంత దూరంలో నించున్న యాభయ్యేళ్ల ఆసామీ వైపు ఓ సారి తల ఎత్తి చూసి, ''ఏరా, వెంకా, ఇలా వచ్చావ్?'' అన్నారు కరణం వెంకటరామయ్యగారు, మళ్లీ తల వంచేసుకుని తమ ధోరణిలో తాము వ్రాసుకుంటూ.

''అబ్బే, ఏం లేదు, బాబయ్యా!...ఏలినోరి దరిసెనం ఓ పాలి సేసుకుపోదాం అనీ...'' కాళ్ల దగ్గిర నేలమీద పెట్టిన సొరకాయలాంటి పొడుగాటి తాటాకు బుట్ట తీసి చేత్తో పట్టుకుని, నాలుగు మెట్లెక్కి, పై రెండు మెట్లమీదనించి ముందుకి వంగుని, హోలు లోపలిపక్క


A.S.Murty

తాటాకుబుట్ట తలకిందులుగా ఒంపాడు వెంకడు.

"ఇవెక్కడివిరా?" అన్నారు కరణంగారు, బుట్టలో నించి పడి గచ్చుమీద బంతిలా దొర్లుతూన్న మెట్ట వంకాయలకేసి చూస్తూ.

"మా గుడిసెవెనకాల దిబ్బమీద రెండు మొక్కల్ని నాటుగు సిందెలుంటే తమరి కిద్దామని తెంపుకొచ్చాను, బాబయ్యా!"

"ఊహూ!" అని మళ్లీ మామూలుగా తల వంచుకుని ముందున్న రిజిష్టరులో పంక్తులమీద అంకెలేవో వేస్తూ, "ఏట్టొచ్చావ్ పని?" అని అడిగారు.

"సిన్న కాగితంముక్క రాసిపెడతారని వొచ్చాను, బాబయ్యా!" తలపాగా తీసి బుర్ర గోక్కుంటూ అన్నాడు వెంకడు.

"ఏం?... వజ్రాలకొట్టుగారి తుమ్మలోవ చేరం తాయం అయిపోయిందేమిట్రా?"

ఒళ్లో ఎడంకాలి తొడమీద పరుచుకున్న రిజిష్టరు చూసి ముందున్న బల్లమీది రిజిష్టరులో ఏదేదో కాలంలో ఎంట్రీలు వెస్తు వేస్తూ అడిగారు కరణంగారు.

"అద్కేం లేదు, బాబయ్యా! ... అరితో మా లాటి బక్కోళ్లం ఎక్కడ తూగ్గలం, బాబయ్యా?"

"అయితే మరి కాగితం దేనికి?" కరణంగారు తలెత్తి చూశారు వెంకడివైపు.

"ఆ మారాజ సచ్చిపోయికూడా ఇన్నేళ్లయినా మాకు సాయం జరగలేదు, బాబయ్యా!" కరణంగారు కూర్చున్నచోట పైనున్న బాపూజీ చిత్రంవైపు వేలు పెట్టి చూపిస్తూ అన్నాడు వెంకడు. "మా మాలోళ్ల మాతిలో ఒక్క సుక్క నీరు లేదు. మా ఆడోళ్లు రెండు కోసుల దూరం ఎల్లి, ఆ ఏటొడ్డున ఇసకలో గుంతలు తవ్వి, నీళ్లూరేదాకా కూకుని, మద్దాసేళ్లకు రెండు ముంతలనీళ్లు తెచ్చుకునేసరికి పొద్దుగూకిపోతుంది. యానంకాలం, తాగటానికి నీరు లేకపోతే పిల్లాబిల్లలతో మేం ఎలా బతకాలి, బాబయ్యా?"

"పెద్దమాతిలో ఓ పక్క మాకు ఒదిలిపెట్టేలా ఏర్పాటు చేయించమని మునసబుగారితో మళ్లీ ఇంకోసారి చెప్పుకోండి."

"తమ రెరగందేం ఉంది, బాబయ్యా!... సంతం కొద్ది ఆ మాతికాడికి ఎల్లిగదా మా పెళ్లి కొడుకు సూరిగాడు పావు తెచ్చిపెట్టుకున్నాడు...

కిందటేడాది తమరి సేత కాగితంముక్క రాయించుకుని మాలపల్లిలో మా వాళ్లందరిసేతా వేలుముద్ర వేయించి, నేనూ, పత్తిగాడూ, బాగడు కొడుకు మూలయ్యగాడూ, ఎల్లయ్య తమ్ముడు పైడితల్లిగాడూ — అంతా పదిమంది కలిసెల్లి సాయంగా జిల్లాకలెకటేరు సేతి కిచ్చి, మా కట్టం, సుకం సెప్పుకున్నాం...

మా ఎదురుగుండానే ఆ కాగితం మీద ఏదో రాసి, పక్కనున్న తాశిల్దారుగారి సేతి కిచ్చి, ఇంగిలీసులో ఏదో సెప్పాడు, బాబూ...

సరే, సూత్తాం ఎల్లండన్నారు తాశిల్దారుగోరు.

ఆ కాగితం ఏమైందో ఏమో, తాశిల్దారుగోరూ, రివెన్యూఇనుసెక్టరుగోరూ మునారికి ఇచ్చిపోల్చారు కాని, ఒక్కసారి దాని ఊసు ఎత్తిన పాపాన పోలేదు."

"అలాంటప్పుడు మళ్లీ ఇప్పుడు కాగితం పెడితే మాత్రం ఏం ప్రయోజనంరా?"

"ఈ సారి కాగితం తిన్నగా మంత్రిగారికే పెట్టేద్దాం. అయిందా అవుద్ది, లేదా మన కర్మ, ఇంక ఇంతే అని ఊరుకుందాం అని మా వోళ్లంతా పట్టు పడతన్నారు బాబయ్యా!...

మీ కట్నం మీకు సెల్లించుకుంటాం. కాదనక రాసిపెట్టండి, బాబయ్యా!..." అంటూ తలపాగా తీసి, ఓ సారలోంచి టాబ్లెట్ అంతపైజుకి పది మడతలు పెట్టి, ముట్టుకుంటే ఏ ముక్క ముక్క ఊడివచ్చేలా నలిగిమాసిపోయిన అయిదు రూపాయల నోటును తీసి హాలులో ముందుకి మెట్లమీదనించే వంగి, చాపమీద కరణంగారిముందు పడేలా దానిని విసురుతూ, "అందాకా ఇప్పటి కిది ఉంచండి, బాబయ్యా. పని అయిం తరవాత మళ్లీ తమరి దరిసెనం సేసుకుంటాము" అన్నాడు వెంకడు.

● ● ●

మంత్రిగారికి కాగితం వెళ్లి, ఇంకా వారం అయినా తిరక్కుండగానే, ఓ రోజున తాశిల్దారుగారు పది సిమ్మెంట్‌బస్తాలూ, నాలుగు పెట్రోమాక్సులైట్లతో



బాపూజీ
(పగిలిన గాజుముక్కలతో చేసిన చిత్రం)
ఎం. వి. రఘు (విజయవాడ - 4)

ఆ ఫిర్కా రెవెన్యూ ఇన్స్పెక్టర్ని, ఇద్దరు తాపీమేస్త్రీలనీ, ఒక శిల్పినీ, ఒక చిత్రకారుణ్ణీ ఇంకా ఎవరెవర్నో వెంటబెట్టుకుని అర్ధరాత్రి వేళ రెండు జీపుల్లో ఆ ఊరికి ఉరుక్కుంటూ వచ్చారు.

మునసబు, కరణాలను లేపారు.

గ్రామనౌకర్లకు కబురంపించారు.

ఈ లోపులో వెలుగుతూన్న జీపులైట్లముందు కూర్చుని, పెట్రోమాక్సులైట్లను ఆద్దె కిచ్చిన ఆపామీ తాలూకు కుర్రాడు వాటిని వెలిగించాడు.

మంగలి వచ్చి ముత్యాలును లేపుకువచ్చాడు.

బారికాడు వెళ్లి మాణిక్యాలును లాక్కువచ్చాడు.

గ్రామనౌకర్లు మంగలీ, బారికాడూ, ఆడకూలీలు ముత్యాలూ, మాణిక్యాలూ వెలుగుతూన్న పెట్రోమాక్సు లైట్లను తలోసాటి చేతో పట్టుకుని ముందు నడుస్తూండగా, మునసబు కరణాలను ఎక్కించుకుని వెనకాల జీపుల్లో తాశిల్దారుగారు ఓ చిన్నసైజు ఊరేగింపులా, ఊరిమధ్య ఖాళీస్థలంలో ఉన్న పెద్ద మాతిదగ్గిరికి వెళ్లారు.

మాతిచప్టామీద నించుని, మసకవెన్నెల్లో అటూ ఇటూ ఉన్న ఊరివైపు ఓ సారి చూశారు.

తన కుడిపక్క ఫర్లాంగుదూరంలో పెంకుటిళ్లూ, డాబాలూ, మేడలూ.

ఎడంపక్క అదే దూరంలో మిణుకుమిణుకుమంటూ వెలుగుతూన్న కిరసనాయిలుబుడ్డి గుడ్డిదీపాలతో మూరు నేలకు తగులుతూ ఉన్న తాటాకు గుడిసెలు.

"అదేనా మాలపల్లె?" గుడిసెలవైపు వేలు పెట్టి చూపిస్తూ అడిగారు తాశిల్దారుగారు.

"చిత్తం!" మునసబు కరణాలు ధ్రువపరిచారు.

ఆ హరిజనవాడవైపు మాతికి పది, పదిహేను గజాల దూరంలో ఒకచోట నించుని, "ఇదిగో, ఇక్కడ పని ప్రారంభించండయ్యా!" అన్నారు తాశిల్దారుగారు తాపీమేస్త్రీలం ఉద్దేశించి.

ఆయన సూచించిన స్థలంలో సీనియర్ మేస్త్రీ తాపీమొనతో నేలమీద గుండ్రంగా అయిదడుగుల వ్యాసం గల ఒక వలయాన్ని గీశాడు.

ఆ వలయానికి దగ్గిర్లో, రెండు కాళ్లను ఎడంగా చాచి, ముందుకి వంగుని, గడ్డపారతో మట్టి తవ్వటం ఆరంభించాడు బారికాడు.

ముత్యాలూ, మాణిక్యాలూ చీరల్ని మోకాళ్లపైకి గోచీపోసి ఎగగట్టి, పమిటకొంగుల్ని వెనకనుంచి ముందుకి బిగలాగి దోపుకుని బిందెలతో పెద్ద మాతినీళ్లు పట్టుకు వచ్చి, బారికాడు తవ్వుతూన్న మట్టిలో పోస్తున్నారు.

మంగలి అడుసు తొక్కుతున్నాడు.

దగ్గిర్లో ఉన్న మునసబుగారి ఇటికావంలోంచి ఎర్రని ఇటుకల్ని జీపు వెనకాల ఉన్న ట్రెయిలర్నిండా పోసి తెచ్చి వలయం చుట్టూ గుట్టలుగా పోశారు, జవాను లిద్దరూ.

వాటిమీద నాలుగు బిందెల నీళ్లు పోసి తడిపించాడు రెండో మేస్త్రీ.

అడుసు నింపిన ఇసరేకుతొట్టె నెత్తికెత్తుకుని, పట్టుకు వచ్చి, వర్తులం లోపల పోస్తున్నారు ముత్యాలూ, మాణిక్యాలూ.

పోసిన అడుసును తాపీతో అంతా సమానంగా సర్ది, దానిమీద ఒక ఇటుక పక్క ఇంకొకటి పేర్చుకుంటూ, ఇటుకకీ ఇటుకకీ మధ్యన ఇంత అడుసు వేసి, వాటిని ఎగుడుదిగుళ్లూ, ముందువెనకలూ లేకుండగా సమానంగా కుదియించి కూర్చోబెడుతూ గుండ్రంగా ఓ వరస కట్టారు. దానిమీద ఇంకో వరస. ఆ వరసమీద మరో వరస.

కోడి కూసేవేళకు సిమ్మెంట్ ప్లాస్టరింగ్‌తో సహా పూర్తి అయి, ఆరడుగుల ఎత్తుకు కిందినుంచి పైకి పోనుపోను క్రమంగా వ్యాసం తగ్గిన ఓ పెడస్టల్ లేచింది.

పెడస్టల్‌కు మధ్యలో, పెద్ద మాతిని పేస్ చేస్తూ, నల్లటి అక్షరాలు చెక్కిన దీర్ఘచతురస్రాకారపు పాలరాతి ఫలకం ఒకటి అమర్చబడింది. మిగతాభాగం అంతా ఎనామెల్ పెయింట్ పూత. ఆ పూతమీద, చుట్టూ ఎగురుతూన్న త్రివర్ణ జాతీయపతాకాలు.

తెల్లవారేసరికి చూడముచ్చటగా అలంకరించబడిన ఆ పెడస్టల్‌మీద ఓ నిలువెత్తు శిలావిగ్రహం.

ఆ విగ్రహం పొడుగునా పైనుంచి కిందికి ఓ జేగురురంగు ఆచ్ఛాదనం.

సాయంత్రం మూడు గంటలకల్లా పెద్ద మాత దగ్గర, ఆచ్ఛాదనం కప్పిన శిలావిగ్రహం పక్కలో ఓ పెద్ద తాటాకుపందిరి.

పందిరి రాటకు అరటిచెట్లు చుట్టబెట్టి కట్టారు.

పందిరి అడుగుకప్పుకి అంతా తెల్లటిగుడ్డ కట్టారు.

దానికింద ఈ మూలనుంచి ఆ మూలకీ, ఆ మూల నుంచి ఈ మూలకీ క్రాస్‌గా రంగురంగుల ఉల్లిపొర కాగితాల తోరణాలు.

శోభాయమానంగా అలంకరించబడిన ఆ పందిరి మధ్యలో తివాసీలు నిండుగా పరిచిన వేదిక. ఆ వేదిక మీద ముందు అంచున ఒక మైకు. వెనకపక్క జవహర్లాల్ నెహ్రూకీ, సర్దార్ వల్లభాయ్‌పటేల్ కీ మధ్య పరుపుమీద కూర్చుని, వెనకఉన్న గుండ్రటి దిండు మీద మోచేతిని ఆనించి కొంచెం వెనకకు వాలి, మొహం పక్కకు తిప్పి నెహ్రూతో మాట్లాడుతూన్న బాపూజీచిత్రం ఉన్న కాన్వాస్.

పందిరిముందు సభాప్రాంగణం అంతా జనంతో కిటకిటలాడుతూంది.

కొంతమంది దూరంగా నించుని చూస్తున్నారు.

సరిగ్గా అయిదు గంటలకు ప్రాంగణంముందు పెద్ద కా రాగింది.

దాంట్లోంచి తెల్లని ఖద్దరుపంచి, ఖద్దరులాల్చీ, ఖద్దరుటోపీ పెట్టుకున్న మంత్రిగారు దిగారు.

దిగుతూనే కూడాఉన్న జిల్లాకలెక్టరు, పోలీసు సూపరెంటు, స్థానిక శాసనసభ్యులు గురునాథంగార్లతో స్టాచ్యూదగ్గరికి వెళ్లారు.

మిన్నుముట్టుతూన్న కరతాళధ్వనుల మధ్య విగ్రహం మీద కప్పిన ఆచ్ఛాదనను తొలగించి ఆవిష్కరించారు.

నున్నటి బోడిగుండు.

నుదురుమీద చుక్క బొట్టు.

ముక్కుమీద ముసలి కళ్లద్దాలు.

మూతిమీద పై పెదవి అంచుకి సమానంగా పొట్టిగా కత్తిరించిన నెరిసిన మీసాలు.

మందహాసం చిందిస్తూన్న బోసి నోరు.

వస్త్రరిక్తవక్షం.

మోకాళ్లపైకి చుట్టబెట్టుకున్న మూరెడు అంగవస్త్రం.

దానిమీద వేళ్లాడుతూ జేబుగడియారం.

కుడిచేతిలో ఊతకర్ర.

దీవిస్తూన్నట్లు పైకెత్తిన ఎడమ అరచెయ్యి.

నడుస్తూన్న భంగిమలో ఒక కాలు వెనక, ఒక కాలు ముందరా వేసి, ఎడంగా ఉన్న పాదాలు.

పాదాలకు సన్నని ఆకుచెప్పులు.

సత్యాహింసలకూ, సర్వమానవ సమానత్వాలకూ చిహ్నమైన పూజ్యబాపూజీ నిలువెత్తు విగ్రహం అది.

బావిగట్టు ఎత్తుకి సమానంగా ఉన్న పెడెస్టల్ మీద పైకి ఆరడుగుల ఎత్తున బావిని ఫేస్‌చేస్తూ ఉంది.

వేదికమీదికి ఎక్కి, మైకుముందు నించుని, జనం వైపు ఓసారి చుట్టూ కలయజూశారు మంత్రిగారు.

"అంతదూరాన నించున్నారెందుకు? ఇలా వచ్చి కూర్చోండి అందరితోబాటూ." పందిరిముందు బారులు దీర్చి కూర్చున్న వేలాది ప్రజలకు దూరంగా, వేరుగా, గొడ్డుతోలులా మాసిన చాలీచాలని గుడ్డలు కట్టుకుని, తైలసంస్కారంలేని, చింపిరితలలు వేసుకుని, బూడిద పూసినట్లున్న శరీరాలతో, సంఘం తమకు చేస్తూన్న అన్యాయాన్ని చాటుతూ అల్లంతదూరంలో నించున్న వాళ్ల నుద్దేశించి, రమ్మంటూన్నట్లు చేతితో సంజ్ఞ చేస్తూ అన్నారు మంత్రిగారు.

వాళ్లంతా ఒకరి మొహాల్లోకి ఒకరు చూసుకున్నారు.

పందిరిముందు వంద గజాల పొడవున కూర్చున్న జనంలోంచి ఒక్కసారిగా సామూహికమైన గుసగుసలు ఆరంభమయ్యాయి.

"ఎందు కలా సందేహిస్తున్నారు?... ఇక్కడ ఈ వేదికమీద కూర్చున్న మేమూ, మా ముందు బారులు తీర్చి కూర్చున్న ఈ వేలాది ప్రజలూ. . ." చేతిని జనసమూహంవైపు చూపిస్తూ అన్నారు. "*ఇక్కడ నించున్న మీరూ—అంతా ఒకే ఒక కుటుంబం* వాళ్లం!" మంత్రిగారి గొంతు గంభీరంగా, హుందాగా ధ్వనించింది.

వేదికమీద కూర్చున్న జిల్లాకలెక్టరుగారు, పోలీసు సూపరెంటుగారు, స్థానిక శాసనసభ్యులు గురునాథం గారు ఒకరి వైపు ఒకరు తిరిగి చిరుదరహాసాలు విరిసిన వదనాలతో పరస్పరం ఒకసారి చూసుకుని చిరు చప్పట్లు కొట్టారు.

సభలో కూర్చున్న జనంకూడా వెంటనే అందుకుని, అత్తగారికి వంత పాడే కోడలిలా చప్పట్లు కొట్టారు.

"మారాజు సెబుతూన్నాడు, సదంద్రా ఎల్లి కూకుందాం!" వెంకడు హుషారివ్వటంతో, అక్కడ నించున్నవాళ్లంతా చొరవగా వచ్చి అందరితోబాటూ కలిసి కూర్చున్నారు.

ఒక్కసారి చిరుదగ్గు దగ్గి, గొంతు సవరించుకుని, మైకుగొట్టాన్ని కుడిచేతితో పట్టుకుని, "మహా జనులారా!. . ." ఉపన్యాసానికి ఉపక్రమించారు మంత్రిగారు.

"ఎన్నో కార్యక్రమాలను రద్దుచేసుకుని, అనుకోకుండా మీ గ్రామానికి రావలిసివచ్చింది ఈ వేళ. నా కీ సదవకాశాన్ని కల్పించిన మీ కందరికీ నా కృతజ్ఞతలు!"

వేదికమీద కూర్చున్నవారు తమలో తాము చిన్నగా నవ్వుకున్నారు.

"మనం అందరం ఈ వేళ ఇక్కడసమావేశమైనాం. ఈ సమావేశానికి ఒక ప్రత్యేకమైన ప్రాశస్త్యం ఉంది. ఎందుకంటే, ఇది ఒక మహాత్ముడు ఆరంభించిన ఒక మహా క్రతువులో ఒక భాగం. . .

ఆ మహాత్ముడు. . ."

నడుస్తూన్న భంగిమలో పక్కన ఉన్న బాపూజీ నిలువెత్తు విగ్రహం వైపు అంతా ఓసారి తలలు తిప్పి చూశారు.

"మనలను విడిచిపెట్టి వెళ్లిపోయి రెండు దశాబ్దాలు పైగా అయినా, మనం ఆయన ఆరంభించిన ఆ మహాక్రతువును ఇంకా పూర్తిచెయ్యలేక పోయాం. ఇందుకు మనం చాలా సిగ్గు పడాలి."

ఆవేశంతో మంత్రిగారి స్వరస్థాయి హెచ్చింది.

"మానవజాతిని పట్టుకుని పీడిస్తూన్న ఏ జాడ్యాలను సమూలంగా నిర్మూలించాలని ఆయన అహరహం తపించిపోయాడో, తన సర్వస్వాన్నీ ధారపోశాడో అవి మనలను పగపట్టిన తాచుల్లా ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. . .


ఇప్పటికీ. . . మనలాగే పుట్టి పెరిగి, ఒంట్లో మనలాంటి రక్తమే ఉన్న సాటి మానవుణ్ణి, మన తోటివాణ్ణి 'నమ్మల్ని ముట్టుకోకు, దూరంగా ఉండు!' అని హూంకరిస్తున్నాం. 'మేం తాగే మంచినీళ్ల బావిలో నువ్వు చేద వెయ్యటానికి వీల్లే' దని తరిమి కొట్టేస్తున్నాం. . ."

ఒకరి మొహాల్లోకి ఒకరు చూసుకున్నారు హరిజనేతర శ్రోతలు.

"ఎంత అమానుషం?. . . ఇంతకంటే ఘోరం మరొహటేం ఉంది ఈ భూమిమీద?. . .

ఒక మందలో ఆవులూ, గేదెలూ కలిసి పడు కుంటాయి. ఒకే నామిలోని గడ్డిపరకల్ని నోటితో లాక్కుని తింటాయి. మచ్చిక చేస్తే పులులూ, మేకలూ

(తరువాయి 47 వ పేజీలో)



చిత్రం— మునగపాటి శివరామకృష్ణ

# మంచి తీర్థం

( 39 వ పేజీ తరువాయి)

సహితం ఒక తొట్టెలో నీళ్ళు తాగుతాయి. . .

గడ్డిగాదరం మేసే పశువులూ, రక్తమాంసాలు భక్షించే క్రూరమృగాలూ అన్నం తినే మనిషికన్న మేలా?"

ఒక్కొక్కరికీ ఒళ్ళు గగుర్పొడిచింది.

"ఆ మహాత్ముడు మనకు బోధించిన సిద్ధాంతాలేమిటి? ఆయన నడిచి మనకు చూపించిన బాట ఏది?. . .

"మనం పఠిస్తున్న ఆయన ప్రవచనాలేమిటి? మన ప్రవర్తన, మనం నడుస్తున్న పద్ధతి ఏమిటి?...

"ప్రతి ఏటా మనం ఆ మహాత్ముడి జయంతులు జరిపి ఆయన సిద్ధాంతాలనూ, సూత్రాలనూ పదే పదే వల్లిస్తాం. వర్ధంతులు జరిపి ఆయన్ని సంస్మరిస్తాం.

"అంతవరకేనా మన కర్తవ్యం? మన బాధ్యత అంతటితో తీరిపోయిందా?. . .

"ఆయన చాటిన సిద్ధాంతాలను ఆచరించనంత వరకూ, ఆయన నడిచి చూపించిన బాటను అనుసరించనంతవరకూ ఈ జయంతులూ, ఈ వర్ధంతులూ ఇవన్నీ కేవలం ఒక అపహాస్యంగా మిగిలిపోవా? ఇది మనం ఆత్మవంచన చేసుకోవటమేగాక, ఒక మహా మనిషి ఆత్మకు తీరని అపచారం, ద్రోహం చెయ్యటం కాదా? ఇదేనా మన జాతిపితకు మనం చూపే గౌరవం? ఇంతేనా మన నైతిక ధర్మం. . ."

మయసభ సీనులో ఏకపాత్రాభినయం చేస్తూ, డైలాగ్ చెబుతూన్న దుర్యోధన పాత్రధారి స్వరంలా మంత్రిగారి స్వరం నాటకీయంగా అవసరాన్నిబట్టి ఉన్నట్టుండి ఒక్కసారిగా గంభీరమైన హెచ్చుస్థాయిలో హోరున పరవళ్ళు తొక్కుతూన్న మహానదీప్రవాహంలా, ఇంకొకప్పుడు తగ్గుస్థాయిలో పిల్లకాలువలలో పారే నీరులా మార్పుల్ని సంతరించుకుంటూ సాగిపోతూంది.

"మహాజనులారా!. . ." క్షణంపాటు ఆగి, లాల్చీ ఎడంచేతిని కొంచెం పైకి లాగి రిస్టువాచీ ఓ సారి చూసుకుని, "జాతి మత విభేదాల పుట్టకురుపులతో, కుల వర్ణవిభేదాల కుష్ఠువ్యాధులతో ఇప్పటికే మనం ఎంతో కుళ్ళిపోయాం. ఇంకా కుళ్ళిపోతూనే ఉన్నాం. ఇలా ఎప్పటికీ కుళ్ళిపోతూ ఉండవలసిందేనా మన జాతి? వ. . . ల్లి. . . కా. . . దు. వ. . . ల్లి. . , కా. . . దు." గంభీర స్వరంతో ఒక్కొక్క అక్షరాన్నీ ఒత్తి ఒత్తి పలుకుతూ, మైకు ముందు చూపుడు వేలును శూన్యంలో గోడగడియారంలోని పెండులంలా ఒక్కసారి ఊపారు అటూ ఇటూ మంత్రిగారు.

"మనల్ని మనం బాగుచేసుకోవాలి. మనం మనుషులం అన్న మాట గుర్తుంచుకోవాలి. మన జాతికి పట్టిన తెగుళ్ళను నివారించుకోవాలి. ఇందుకు ప్రతి పౌరుడూ చిత్తశుద్ధితో శపథం పూనాలి. . .

"ఈ సభలో మనం అందరం ఏకకంఠంతో ఆ శపథాన్ని తీసుకుందాం.

'జాతి మత విభేదాల జోలికి పోం.' దయచేసి అంతా చెప్పండి! జాతిమత విభేదాల జోలికి పోం." ఆవేశపూరితంగా మంత్రిగారు ఎలుగెత్తి అరిచారు.

సభాప్రాంగణంలో ఉన్న వేలాది ప్రజలూ ఒక్కసారిగా అదే స్థాయిలో ఒక నినాదంగా "జాతి మత విభేదాల జోలికి పోం!. . జాతి మత విభేదాల జోలికి పోం!" అంటూ అరిచారు.

"కుల వర్ణ విభేదాలను విడనాడతాం!"

సభాప్రాంగణం అంతా మరోసారి ఆ నినాదంతో మారుమోగింది.

"మహాత్మాగాంధీకీ జై!"

"మహాత్మాగాంధీకి జై!" మంత్రిగారి గొంతుతో జనసమూహంకూడా వంత కలిపింది.

మహదానందంతో, తృప్తిగా, నోటినిండుగా నవ్వుతూ జనాన్నంతనూ ఓ సారి కలయజూశారు మంత్రిగారు.

"మహాజనులారా!" మళ్ళీ ఆరంభించారు మంత్రిగారు. "మాటలకూ చేతలకూ చాలా దూరం. ఈ రెండింటికీ మధ్య సమన్వయం కుదిరి, ఆ మాటలు క్రియారూపంలోకి తర్జుమా అయినప్పుడే ఆ మాటలకు విలువ. . .

"మనం ఇప్పు డొక ప్రతిన పూనాం. ఆ ప్రతిన ఆచరణలో పెట్టి చూపించి, మాటలకూ చేతలకూ చాలా దూరం అన్న నానుడి సత్యదూరం అని నిరూపించి మన చిత్తశుద్ధిని చాటుకోవాలి. . .

"ఇందుకు ఈ పెద్దమాతినే మనం ఒక గొప్ప అవకాశంగా తీసుకుందాం. . .

"ఈ ఊళ్ళో ఎంత మండువేసవిలోనైనా ఎండి పోకుండగా ఉండే మంచినీళ్ళబావి ఇదొక్కటే. కొబట్టి నేటినుంచి మన హరిజనసోదరులుకూడా ఈ బావిలో నీళ్ళు తోడుకోవలసిందనీ, వాళ్ళు అలా తోడుకుంటూండగా చూసి సంబరంతో పొంగిపోయే అదృష్టం మన కందరికీ ఇప్పుడే కలిగించమనీ వారిని మన అందరి తరపున వేడుకుంటున్నాను."

వేదికమీద కూర్చున్న జిల్లాఅధికారులూ, స్థానిక శాసనసభ్యులు గురునాథంగారూ గబగబా చప్పట్లు కొట్టారు.

మంత్రిగారి నోట్లో మాట ఇంకా నోట్లో ఉండగానే హరిజనవాడ వాడంతా నెత్తిమీద కుండలూ, చేతిలో తాటాకుచేదలూ పట్టుకుని ఉరుక్కుంటూ వచ్చి, ఊళ్ళో అమ్మవారి జాతర రోజున సందగ జరుపుకునే సంబరంతో, పెద్దనుయ్యి చుట్టూ చేరి నీళ్ళు తోడుకోవటం ఆరంభించారు.

అసలే వేసంకాలం. అందులో గంటసేపు ఆవేశ పూరితంగా గొంతు చించుకుని గంభీరంగా ఉపన్యాసం ఇచ్చారేమో, మంత్రిగారికి దాహం వేసింది.

పక్కకు తిరిగి, "కొంచెం మంచితీర్థం ఇప్పించమనండి!" అన్నారు మంత్రిగారు.

కలెక్టరుగారు తహశీల్దారువైపు తిరిగారు.

తహశీల్దారుగారు డిప్యూటీ తహశీల్దారు వైపు తిరిగారు.

ఆయన రెవెన్యూ ఇన్‌స్పెక్టరువైపు, ఇలా ఆ కబురు, రిజర్వాయర్‌లోంచి నగరానికి నీరు ముందు పెద్ద పెద్ద గొట్టాల్లోకి, వాటిల్లోంచి వీథుల్లోని చిన్న గొట్టాల్లోకి, ఆఖరున మన ఇళ్ళలోని సన్నని కుళాయిల్లోకి వచ్చినట్లు కరణంగారి దాకా వచ్చింది.

ఆయన మోకాళ్ళపైకి ఎగగట్టుకున్న పంచెకొంగుల్ని కిందికి వదిలి, కట్టు సరిగ్గా ఉందో లేదో ఓ సారి ముందూ వెనకా చూసుకుని, పైమీద ఉన్న కండువాను తీసి తలపాగా చుట్టి, నిండా నీళ్ళున్న గాజుగ్లాసును చేత్తో పట్టుకుని, వేదిక ఎక్కి వినయవిధేయతలతో ముందుకి కొంచెం వంగి, గ్లాసును మంత్రిగారి చేతి కందించారు.

గ్లాసు పైఅంచుని పెదవులకు తాకేలా పెట్టుకుంటూ, మళ్ళీ అంతలోనే కొంచెం ఎడంగా తీసి పట్టుకుని, కరణంగారి కళ్ళలోకి చూస్తూ, "ఏమండీ! ఇవీ. . .?" దీర్ఘంతో అర్ధోక్తిలో నాపేశారు మంత్రిగారు.

భయభక్తులతో రెండు చేతుల్నీ కట్టుకునిఉన్న కరణంగారు చటుక్కున ముక్కుమీద వేలు వేసుకుని, "ఎంతమాట!. . . ఎంతమాట!. . . తమ కంత అపచారం చేస్తానా?. . . ఇవి అక్షరాలా మంచితీర్థం. సందేహించక తమరు పుచ్చుకోండయ్యా!" అన్నారు దణ్ణం పెడుతూ.

"అయితే, సరే!" ధైర్యంగా గ్లాసుడునీళ్ళూ గడగడ తాగేశారు మంత్రిగారు! ★



ఊరికి

ఫోటో—పి. ఎమ్. వరప్రసాదరావు (గుంటూరు—2)